గణితంలో నైపుణ్యాలు అవసరం


అబాకస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్ : గణితంలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి డీ. ఆర్ గార్గ్ సూచించారు. సిప్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అబాకస్ పోటీలను పట్టణంలోని క్లాసిక్ త్రీ కన్వెన్షన్‌లో నిర్వహించారు. మానవ పురోగతిలో గణితం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో గణితమే ప్రధానమైందన్నారు. 23 రాష్ట్రాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాష్‌గౌడ్‌కు కమ్మ సంఘం మద్దతు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కమ్మ, సెటిలర్ల సంఘం నాయకులు ఆదివారం మణికొండ మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ హైమాంజలి, కాకతీయ కమ్మ సంఘం అధ్యక్షుడు బ్రహ్మాజీ, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ చంద్రబాబుకు చివరి వరకు మద్దతుగా నిలిచిన ప్రకాశ్‌గౌడ్‌కు మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో నియోజకవర్గంలోని కమ్మ, సెటిలర్స్ అంతా బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని వారు కోరారు.

ఈ దారులు బాగుపడేదెన్నడు..?

- అధ్వానంగా మారిన రోడ్లు
- వరదలతో కుంగిపోయిన కల్వర్టు, సీసీరోడ్డు
- కోర్టు వివాదంతో విస్తరణ పనులకు బ్రేక్


కేజీ.దొడ్డి -సుల్తాన్‌పల్లి మార్గంలో అధ్వానంగా మారిన రోడ్డు

శంషాబాద్ రూరల్: ఓ వైపు వరద దాటికి కుంగిపోయిన సీసీరోడ్డు.. మరో వైపు అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులు.. నిత్యం వందల వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే ఈ రెండు మార్గాల వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. మండలంలోని కేబీ.దొడ్డి గ్రామానికి వెళ్లే ఈ రెండు దారుల్లో వానాకాలం వస్తే రాకపోకలు ఆగిపోవాల్సిందే. బీటీ రోడ్డుతో పాటు సీసీ రోడ్డును మట్టితో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్ల నుంచి నెలకొన్న ఈ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధ్వంసమైన కల్వర్టు..

కేబీ.దొడ్డి నుంచి సుల్తాన్‌పల్లికి వెళ్లే మార్గంలో ఎంటేరువాగుపై ఉన్న కల్వర్టు వరద కారణంగా రెండేళ్ల క్రితం ధ్వంసమైంది. కల్వర్టుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మరో వైపు ఈ కల్వర్టు నుంచి సుమారు 200 మీటర్ల దూరం వరకు రోడ్డు కుంగిపోయి బీటలు వారింది. సీసీరోడ్డు ఎగుడు దిగుడుగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నెల క్రితం కల్వర్టుపై గోతులను పూడ్చివేయగా.. బీటలు వారిన సీసీ రోడ్డుపై మట్టిపోసి పూడ్చారు.

విస్తరణ పనులకు గ్రహణం..

శంషాబాద్-మొయినాబాద్ మండలాలను అనుసంధానం చేస్తూ.. ఈసీవాగుపై నుంచి వంతెనతో పాటు రహదారి విస్తరణ చేపట్టారు. కేబీ.దొడ్డి నుంచి రాయన్నగూడ వెళ్లే మార్గంలో సుమారు 800 మీటర్ల దూరం వరకు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ మార్గంలో భారీ గుంతలు ఏర్పడి వానాకాలంలో వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల మట్టితో ఈ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. కోర్టు వివాదం కారణంగా విస్తరణ పనులు నిలిచిపోగా.. సమస్య పరిష్కారం కోసం ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరదొస్తే రాకపోకలు బంద్..

ఎంటేరువాగుపై ఉన్న ఈ కల్వర్టు మీదుగా వానాకాలంలో రాకపోకలు నిలిచిపోతుంటాయి. వరద తీవ్రంగా ఉంటే రోజుల కొద్ది దారిని మూసి వేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. కల్వర్టు ఎత్తు పెంచి రోడ్డు నిర్మాణం చేపడితే శాశ్వత పరిష్కారం దొరకుతుందని స్థానికులు చెబుతున్నారు.

నిత్యం బిజీబిజీగా..

మొయినాబాద్ మండలం నుంచి శంషాబాద్, షాబాద్, కొత్తూరు, మహేశ్వరం మండలాలల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు ఈ మార్గాల గుండా రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ దారులు అధ్వానంగా మారడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మరోవైపు ఈ మార్గాల్లో భారీ వాహనాల కారణంగా రోడ్డు దిబ్బతింటుందని స్థానికులు పేర్కొంటున్నారు.


రాయన్నగూడ మార్గంలో నిలిచిపోయిన విస్తరణ పనులు

అధికారుల ఓటుహక్కు వినియోగం


ఓటువేసిన రిటర్నింగ్ అధికారి మల్లయ్య

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల విధుల్లో పాల్గొనున్న పోలీసులు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ఆర్డీఓ కార్యాలయం, శివరాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ఆదివారం పెద్దఎత్తున ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోలింగ్ బూత్‌లలో మొత్తం 424 మంది తమ ఓటుహక్కును వినియోగించున్నట్లు రిటర్నింగ్ అధికారి మల్లయ్య పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌తో పాటు శివరాంపల్లి పాఠశాలలో పోలింగ్‌బూత్ మరో రెండ్రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనున్న ఉద్యోగులు ఈ పోలింగ్‌బూత్‌లలో ముందస్తుగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 1484 మంది ఉద్యోగులు ఆదివారం సాయంత్రం వరకు తమ ఓటుహక్కును వినియోగించున్నట్లు వివరించారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. లిస్టులో తమ పేర్లను సరిచూసుకుని ఓటుహక్కును పొందాలన్నారు. ఆర్డీఓ కార్యాలయంతో పాటు శివరాంపల్లి పాఠశాలలో మరో రెండ్రోజుల పాటు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అధికారులంతా అందుబాటులో ఉంటారన్నారు. తమకు ఎన్నికల విధుల కోసం అందజేసిన పత్రాన్ని ప్రొసిడింగ్ అధికారికి చూపించి ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. పోలింగ్ స్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

బీజేపీ విస్తృత ప్రచారం


మధుబన్‌కాలనీలో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి చేయని ఎమ్మెల్యేకు ఎందుకు ఓటువేయాలని ప్రజలు నిలదీస్తూ.. బీజేపీకి సానుకూలంగా ఉన్నారని మధుబన్‌కాలనీ బీజేపీ అధ్యక్షుడు చెన్‌రెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి బీజేపీకి ఓటు వేయాలని మహిళ కార్యకర్తలతో జోరుగా ప్రచారం నిర్వహించారు. బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 'మధుబన్‌కాలనీలో ఎమ్మెల్యే అభివృద్ధి చేసిందేమి లేదని..ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నదని.. ప్రజలు గమనిస్తున్నారన్నారు'. అభివృద్ధి కావాలంటే రాజేంద్రనగర్‌లో బీజేపీ ఎమ్మెల్యే కావాలని ఆకాంక్షించారు. ఈ సారి మార్పు వచ్చి బీజేపీని గెలిపించేందుకు ప్రతి ఒక్క ఓటరు ముందుకొస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్.వీ రెడ్డి, ఎం.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం


మార్కండేయనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సంపత్ గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సీనియర్ బీజేపీ నాయకుడు సంతుగౌడ్ అన్నారు. ఆదివారం మార్కండేయనగర్‌లో బీజేపీ కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సంతుగౌడ్ మాట్లాడుతూ.. మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, బాబుల్‌రెడ్డి నగర్ ,మారడేయనగర్‌లలో ఎలాంటి అభివృద్ధి చేశారో చూపించాలని ప్రశ్నించారు. ఏ గల్లీ చూసిన మురుగు నీరు రోడ్లపై ఉండడం, గుంతల మయోమైన రోడ్లు ఇవి ప్రకాష్‌గౌడ్ చేసిన అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. అభివృద్ధి ఎలా ఉంటుందో ఒక్క సారి ప్రజలు తోకల శ్రీనివాస్ రెడ్డికి అవకాశం కల్పించి చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రమణగుప్తా, చింటురెడ్డి, రావుల నవీన్, వెంకటేష్ , సాయి కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ఆకర్శించేందుకు నేతల పాట్లు

రాజేంద్రనగర్: పోలింగ్ తేదీ గడువు దగ్గర పడుతుండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓటర్లను తమ వైపు ఆకర్షించేందుకు నానా తంటాలు పడుతున్నారు. రాజేంద్రనగర్‌లో బీజేపీ, మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధాన పార్టీలతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రతిరోజు ఆయా ప్రాంతాల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రచారానికి గడువు ముగుస్తుండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారంలో బిజీగా కనిపిస్తున్నారు. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేందుకు తహతహలాడుతున్నారు. తమ పార్టీకి ఓటువేయాలని కాళ్లు మొక్కుతూ వారి ఆశీర్వాదాన్ని పొందుతున్నారు. కొందరు తమకే ఓటు వేయాలంటూ.. నాయనా బయనాతో ఒప్పిస్తున్నారు. కుల సంఘాలు, యువకులు, కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాల సభ్యులకు వన భోజనాలు, విందులు ఇస్తూ ఆకర్షిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి ఏకంగా ఓటర్ల కాళ్లు మొక్కుతూ ప్రచారం చేశారు.

మాదిగలకు బీఆర్‌ఎస్ సముచిత స్థానం


హైదర్షాకోట్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీ ఎమ్మార్పీఎస్ నాయకులు

బండ్లగూడ: ఓట్ల కోసమే బీజేపీ మాదిగలను మోసం చేస్తుందని, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కేంద్రప్రభుత్వం వర్గీకరణ ఎందుకు చేయలేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(టీ ఎమ్మార్పీఎస్) జాతీయ ఉపాధ్యక్షులు నందిగామ నర్సింహ్మా ప్రశ్నించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సురేష్‌తో కలిసి టీ ఎమ్మార్పీఎస్ నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హైదర్షాకోట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మందకృష్ణ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మాదిగలకు సముచిత న్యాయం కల్పించారని, ముఖ్యమైన పదవుల్లో మాదిగలను కొనసాగించారన్నారు. మలాకీ రత్నం, జగదీష్, నర్సింహ్మా, వెంకటేష్, పెంటయ్యా, రవికుమార్, కె.లక్ష్మిరాజ్, శ్రీను, అశోక్, నందిగామ నీస్సీ, మురళీ, జయరాజ్, చిన్నా, సునీల్, జంగయ్యా, అనిల్, మల్లేష్, లక్ష్మయ్య తదితరులున్నారు.

రాష్ట్రంలో ఉత్తమ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పీఅండ్‌టీ కాలనీలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కాలనీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ముస్లిం, మైనార్టీల శ్మశానవాటిక కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. పీఅండ్‌టీ కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు తప్పకుండా పూర్తి చేస్తామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ పాలన దక్షత కారణంగా వేలాది పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరుతుందన్నారు. గత పదేళ్లలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. ప్రైవేటు పరిశ్రమలతో పాటు ఐటీ కంపెనీల స్థాపన వల్ల యువతకు ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారం సాధించడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో ప్రజల మద్దతు పూర్తిగా బీఆర్‌ఎస్‌కే ఉందని, మరోసారి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు పాపయ్యాయాదవ్, సుమన్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, నదీమ్ తదితరులున్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక..

మణికొండ: ప్రత్యూష చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, సంఘ సేవకురాలు, స్వర్గీయ సినీనటి ప్రత్యూష తల్లి సరోజిని ఆదివారం మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోరాడి రాష్ట్రాన్ని సాధించడంతో పాటు అన్ని రంగాలు, దేశంలోనే ఉన్నతంగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ అవసరమైన సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని, ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా నాల్గోసారి ప్రకాష్‌గౌడ్‌ను గెలిపించాలని ఆమె కోరారు.


ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం..

శంషాబాద్: నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలపించాలని కోరుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. 18వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని వివరిస్తున్నారు. ప్రకాష్‌గౌడ్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా తదితర సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

ప్రధానిని కలిసిన బీజేవైఎం నేత


ప్రధాని నరేంద్ర మోదీతో మహేందర్

శంషాబాద్: తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పర్యటిస్తున్న భారత ప్రధాని నరేంద్రమోదీని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సెవెళ్ల మహేందర్ కలిశారు. ఈ సందర్భంగా ప్రధానికి 'పవర్ ఇన్ టెంపుల్స్'పుస్తకాలను బహూకరించారు. రాష్ట్ర పర్యటనలో మరోసారి ప్రధానిని నేరుగా కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ



మణికొండ: కార్తీకమాసం.. పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం దేవాలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. మణికొండ పార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం, చంద్రమౌళీశ్వర స్వామి, మంచిరేవుల మచిలేశ్వరస్వామి దేవాలయాల వద్ద సాయంత్రం పెద్దఎత్తున తరలి వచ్చిన మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయాల ఆవరణ, రావి, ఉసిరి చెట్ల వద్ద పెద్దఎత్తున దీపాలను వెలిగించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. దీపాల అలంకరణతో దేవాలయాలు శోభాయమానంగా వెలిగిపోయాయి. అనంతరం దేవాలయాల ఆవరణలో జ్వాలాతోరణం నిర్వహించారు.

కాంగ్రెస్ గెలుపును ఆపలేరు


మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్

మణికొండ: రాజేంద్రనగర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, అనేక సర్వేలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని నివేదికలు ఇస్తున్నాయని, ఇక కాంగ్రెస్ గెలుపును ఎవరూ.. ఆపలేరని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ శివాలయం, పుప్పాల్‌గూడ గ్రామం, బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్, అలకాపూర్ టౌన్‌షిప్, నెక్నాంపూర్, వేంకటేశ్వరకాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, హుడా కాలనీ, పంచవటీ కాలనీ, ల్యాంకోహిల్స్, చిత్రపురి కాలనీ, మణికొండ గ్రామం, మర్రిచెట్టు చౌరస్తా వరకు రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ ప్రజలు కాంగ్రెస్ పక్షాన నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు ఏకపక్షంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'గెలుపు మాదే.. మైనార్టీ ఓటు మాకే'

అత్తాపూర్: నియోజకవర్గంలో ఎగిరేది కాంగ్రెస్ పార్టీ జెండాయేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ తరపున పీసీసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గం అత్తాపూర్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని, ముస్లిం మైనారీలు కాంగ్రెస్‌కు అనుకూలంగా స్పందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల్లో అధికార పార్టీపై వ్యతిరేకత తమకు సానుకూలత వ్యక్తమవుతుందన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా తమపై సానుభూతి వ్యక్తమవుతుందని, కాంగ్రెస్ గతంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను ఓటర్లే ప్రస్తావిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కూడా ఖాయమైందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.


రోడ్‌షోకు తరలివచ్చిన కాంగ్రెస్ నేతలు


ర్యాలీగా తరలిన కాంగ్రెస్ పార్టీ నేతలు

రాజేంద్రనగర్‌లో మార్పు మొదలయ్యింది


చిత్రపురిలో ఓటర్లతో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: గత మూడు ఎన్నికల్లో ప్రకాశ్‌గౌడ్‌కు సరైన ప్రత్యర్థిలేక అతన్ని గెలిపించారని, ఈ సారి బీజేపీ పార్టీ నుంచి సరైన ప్రత్యర్థి రంగంలో ఉండటంతో ప్రజల్లో విపరీతంగా మార్పు కనిపిస్తుందని, అది ప్రకాశ్‌గౌడ్ ఓటమికి దారి తీస్తుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని రాజపుష్ప, మై హోం అవతార్ గేటెడ్ కమ్యూనిటీలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధికులు చదువుకున్న ఓటర్లు ఉన్న నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకున్న యువకుడు, బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రతి ఒక్కరికి అండగా ఉంటా..

రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేలా, సమస్యల పరిష్కారానికి ఓ యాప్, ఫోన్ నెంబర్‌లు అందుబాటులో పెడతానన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'కమల వికాసం ఖాయం'..

అత్తాపూర్: రాజేంద్రనగర్‌లో కమల వికాసం ఖాయమైపోయిందని బీజేపీ కార్పొరేటర్ సంగీతా గౌరీశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి తరపున ఆమె అత్తాపూర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. అభ్యర్థితో డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ మహిళా ఓటర్లను ఓటును ఆకర్షించే ప్రయత్నం చేశారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. తెలంగాణ ఎన్నికల ప్రణాళికలోని ముఖ్య అంశాలను ప్రజలకు వివరించారు. అందరికీ అన్ని వేళలో అందుబాటులో వ్యక్తిగా ఉన్న తమ అభ్యర్థికి ఓటు వేసి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, జిల్లా కార్యదర్శి కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, ఎస్.విజయ్‌కుమార్, స్టార్ రాజు, వేణురెడ్డి, సన్నివేలి శ్రీపాల్ రెడ్డి, జయనాథ్‌రెడ్డి, సరిత, గాయత్రి, అనురాధ, విజయరెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్, విశాల్ శర్మ, సిద్దేశ్వర్, శశికాంత్ శర్మ, రాచూరి రాజశేఖర్, ముఖేష్, శ్రీకాంత్ చారి, భరత్, ధనుంజయ తదితరులున్నారు.


రాజపుష్పలో ప్రచారం చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్

బీసీలు రాజ్యాధికారం వదులుకోవద్దు

బీజేపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్



మణికొండ: దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న బీసీలకు రాజ్యాధికారం, ఎస్సీలకు వర్గీకరణ త్వరలోనే నెరవేరాలంటే ఆయా వర్గాల వారు ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన కోకాపేటలో నిర్వహించిన ప్రచారంలో రాజేంద్రనగర్ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కొట్లాడిన వారిని పక్కకు పంపి ద్రోహులకు మంత్రి పదవులు ఇచ్చుకున్న ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి దక్కుతుందన్నారు. అన్ని వర్గాలకు తీరని అన్యాయం చేసిన బీఆర్‌ఎస్ పార్టీని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ తన కుటుంబంలోని అందరికీ పదవులు ఇచ్చుకుని నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలకు నమ్మొద్దని, అలా నమ్మినందుకు కర్ణాటక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

'కేసీఆర్ కుటుంబానికి ఎమ్మెల్యే గులాం'..

సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గులాం గిరి చేస్తున్నారని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలోని భూములను స్థానిక ప్రజల అవసరాలకు సైతం ఉంచకుండా అమ్ముతుంటే చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శించారు. స్థానిక భూములు అమ్మగా వచ్చిన నిధులలో 10 శాతం నియోజకవర్గంలో ఖర్చుచేస్తే నందన వనంగా మారేదన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, ఖానాపూర్, నార్సింగి, మంచిరేవులలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కోకాపేట కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.